# నేను రచయిత్రిని కాను

## సోమంచి ఉషారాణి

"శారదమ్మగారూ...!!! అబ్బాయికి పెళ్లి సంబంధం తీసుకొచ్చాను. పిల్ల ఎం.సి.ఎ. చేసింది. చాలా తెలివైంది. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం కూడా చేస్తోంది. "మధ్యవర్తి శంకరంగారు వరుసగా ఏకరువు పెడుతూంటే..."

"ఆగండి ! ఆగండి...!! పిల్ల తల్లితండ్రులు, కుటుంబ సంప్రదాయం ఎంత కట్నం ఇవ్వగలరు అవి చెప్పండి మీరు" శారద అలా అనేసరికి మధ్యవర్తితో సహా ఇంట్లో వాళ్ళు విస్తుపోయారు.


"అమ్మా...!! తమరు కట్నం గురించి" నీళ్లు నమిలాడు శంకరం. ఎందుకంటే ఆవిడో అభ్యుదయ రచయిత్రి. వ్రాతల్లోనే కాకుండా చేతల్లో కూడా వుండాలంటూ కూతురికి కట్నం ఇవ్వనుగాక ఇవ్వనని, పెళ్లి సంప్రదాయంగా ఏ లోటూ రాకుండా జరిపిస్తానని పట్టుబట్టి అలాగే జరిపించింది.

"అదేమిటోయ్ నువ్వు వరకట్నానికి వ్యతిరేకివిగా అంటూ శారద భర్త రాజారావు "అవునమ్మా... ఊరికే సరదాగా అంటున్నావు కదూ... అని కొడుకు రఘు ప్రశ్నార్థకంగా చూశారు.

" నిజంగానే అంటున్నాను. నువ్వు మంచి వుద్యోగం చేస్తూ నెలకు అరలక్ష సంపాదిస్తూ ఆరు లక్షల కట్నం తీసుకోకపోతే, అదీ తక్కువే అనుకో...!! నీకు పది లక్షలయినా కళ్ళు మూసుకుని ఇస్తారు. ఇంత సంపాదిస్తూ కట్నం తీసుకోకపోవడం ఏమిటి? ఆ కుటుంబంలో ఏదో లొసుగు వుండి వుంటుందని చెవులు కొరుక్కుంటారు. ఈ మధ్య శాంతమ్మగారి కొడుకు పెళ్లి విషయంలో అలాగే జరిగిందని శారద చేతులు తిప్పుతూ గొప్ప సంగతిలా చెప్పింది.

"ఏం జరిగిందమ్మా ?..." శంకరం ఉండబట్టలేక పోయాడు. అవతల వాళ్లకు కట్నం తీసుకోరని ప్రగల్భాలు చెప్పి వచ్చాడు. ఇపుడేమో ఈవిడలా ప్లేటు ఫిరాయించింది.

"వాళ్ళ ముందు తరంలో ఎవరికో పిచ్చి వుండేదనీ, అందుకే పిల్ల దొరికితే చాలని కట్నం తీసుకోకుండా చేసుకుంటున్నారనీ అభాండం వేసారు."




"నిజంగా ఉన్నారేమో..." శంకరం శంక...!!

"అదేమో కానీ పెద్ద గొడవే జరిగింది. పెద్దవాళ్లూ, మంచీ మర్యాద తెలిసిన నలుగురు పెద్ద మనుష్యులు కలుగజేసుకుని సర్ది చెప్పి ఆడపెళ్లి వారిని ఒప్పించారు. అది చూసాక కట్నం తీసుకోకుండా పెళ్లి చేయకూడదని నిర్ణయానికి వచ్చాను." శారద తనను తాను సమర్థించుకోవడంలో కూడా తన రచనా చాతుర్యాన్ని చూపించిందని నవ్వుకున్నాడు రాజారావు.

"మనం అలాంటి వాళ్లం కాదు కదమ్మా...., ఐమీన్ మనింట్లో ముందు తరంలో అలా ఎవరూ లేరుగా...!!" రఘు అసహనంగా అన్నాడు.

"లేరని నీకూ నాకూ తెలుసు... లోకులు కాకులని నిందవేయడానికి సాక్ష్యాలు కావాలా? అంతే కాదు సంప్రదాయమైన పిల్ల. ఇంటి పనంతా శ్రద్ధగా తీరువుగా చేసే అమ్మాయిని కోడలిగా చేసుకోవాలని అనుకుంటున్నాను. ఈ ఉద్యోగాలు, పరుగులు ఒక్కపనీ చేతకాకపోవడం ఓపిక లేకపోయినా చచ్చేదాకా కోడలికి, మనవలకి చాకిరీలు చేయడం నా వల్లకాదు. నువ్వు సంపాదించే డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తూ ఇంటిని చక్కదిద్దుకునే పిల్లయితే బావుండునను కుంటున్నాను. నువ్వేమంటావు?" శారద కోడలి గూర్చి చాలా ఆలోచించిందనిపించింది రాజా రావుకు.

"ఈ రోజుల్లో అలాంటివారు వున్నారంటావా శారదా...!! ఒకవేళ వున్నా, ఏ మధ్యతరగతి అమ్మాయో దొరుకుతుంది. వాళ్లంత కట్నం ఇచ్చు కోలేరేమో.." అన్నాడు రాజారావు.

"అలాంటి పిల్ల దొరికితే కట్నం కొంచెం కన్సెషన్ ఇవ్వచ్చులెండి... ఏరా అబ్బాయి నువ్వేం మాట్లాడవు?"

"నువ్విచ్చిన షాక్ నుండి ఇంకా తేరు కోలేదు. నన్ను కొంచెం ఆలోచించుకోని వ్వమ్మా..." అంటూ లేచి వెళ్లిపోయాడు రఘు.

"అమ్మా... నేను కూడా వెళ్లొస్తాను" లేచాడు శంకరంగారు.

"అదేమిటి? సంబంధం వివరాలేమీ చెప్ప కుండా వెళ్ళిపోతున్నారు?" శారద అడిగింది.

"అమ్మా... వాళ్ళు కట్నం ఇవ్వలేనన్నారు. పిల్ల చదువుకుంది ఉద్యోగం చేస్తోంది, మీరు కోరుకున్నట్లు పనీ పాటా చేస్తూ ఇల్లు చక్కపెట్టలేదు. అలాంటి సంబంధం వస్తే మళ్లీ వస్తాలెండి" అని వెళ్లిపోయాడు.

రాజారావు పక్కున నవ్వుతూంటే శారద చిన్నబుచ్చుకుంటూ "ఎందుకలా నవ్వుతారు? ఎలాంటి కోడలు వస్తుందేమోనని మీకేమయినా టెన్షన్ వుందా" అంది.

"మీ రచయిత్రులతో మాట్లాడటం చాలా కష్టం బాబూ... ఎలాగైనా సమర్థించుకో గలరు" అన్నాడు రాజారావు పేపర్ తిరగేస్తూ...,

ఫోను మోగడంతో శారద "హల్లో" అనగానే "అమ్మా...!! మా మావగారు ఇకలేరమ్మా..." అట్నించి స్వాతి ఏడుస్తూ తల్లితో చెప్పింది.

"అయ్యో...!!! ఎలా...? బాధ, ఆశ్చర్యం కలగలిపి శారద మాట్లాడుతుంటే విషయం అర్థం కాక, రాజారావు భార్యవైపే చూస్తుంటే... "హార్ట్అటాక్ అమ్మా..." కూడబలుక్కుని కూతురు అన్న మాటలు విని "హార్ట్ అటాక్‌తో వియ్యంకుడు పోయాడట" రిసీవర్ చేతితో మూసి భర్తతో మెల్లగా చెప్పింది.

అరె...!!ఇలా ఇవ్వు..అని రిసీవర్ తీసు కుని

“సారీ అమ్మడూ... నువ్వేం బాధపడకు... మన చేతుల్లో ఏముంది? అల్లుడుగారు ఎలా వున్నారు?” అన్నాడు రాజారావు కంగారుగా.

“ఆయన చాలా బాధపడుతున్నారు డాడీ... వారికి వాళ్ల నాన్న గారంటే చాలా ప్రేమ” బాధగా అంది స్వాతి.

“అవునవును మాకు తెలుసుగా... సరే మేము వస్తున్నాం. అత్త గార్ని జాగ్రత్తగా చూసుకో...” అంటూ ఫోను పెట్టాడు.




— — —

“వియ్యంకుడు పోతే చూడ డానికి వియ్యంకుడు వెళ్ళకూడదట. వియ్యపురాలు వెళ్ళచ్చొట. అలాగే వియ్యపురాలు పోతే వియ్యంకుడు వెళ్లొచ్చట... ఏంటో ఆచారాలు... ఎవరు కని పెట్టారు?”

“శారద కూతురు ఇంటికి వచ్చింది. కూతుర్ని, అల్లుడిని, వియ్యపురాలిని ఓదార్చింది. కూతురింట్లో అత్తగారిదే అధికారమంతా... ఆవిడ ఒకపక్క బాధపడుతూనే అన్ని పనుల్ని అందర్నీ గమనిస్తోంది. డబ్బు ఖర్చు పెట్టాలన్నా, ఎవరెక్కడికి వెళ్ళాలన్నా ఆవిడ పర్మిషన్ వుండాల్సిందే! ఇలాంటపుడు కూడా ఆవిడ పెత్తనమేనా? శారద ఆశ్చర్యపోయింది.

“ఏమిటమ్మా...!! నువ్వుకూడా... అభ్యుదయ రచయిత్రివై వుండి అలా ఆశ్చర్య పోతావేంటి? భర్త పోయినంత మాత్రాన ఆవిడ అధికారం చేజారి పోయినట్లేనా? ఆమె ఆత్మాభిమానం చంపుకోవలసిందేనా? అని ఒక కథలో రాయలేదా?” కూతురు సన్నాయి నొక్కులు నొక్కింది.

“హు... అలాగే వుంది. కథలో పాత్రలు నడచివచ్చినట్లు...!! ఎలాగైనా మీ అత్తగారి డామినేషన్ ఎక్కువేనమ్మా...” కొన్ని సంఘటనలు రాయ డానికి చదవడానికి బావుంటాయి గానీ, ఆచరించ డానికి కాదేమో నిట్టూర్చింది శారద.”

“మనకు అహంభావంలా కనిపించే విషయాలు వాళ్లకు ఆత్మవిశ్వాసం కావచ్చుగా... పోనీలేమ్మా ఒదిలేయి... ఏం జరిగినా గమ్మున చూస్తూండు” అని వెళ్లి పోయింది స్వాతి. తన కళ్లముందు తన చేతిలో పెరిగిన కూతురు పెళ్ళయ్యాక చాలా ఎదిగిపోయిందనిపించింది శారదకు... ఆడ వాళ్ళకు మామూలే అనుకుంది కానీ, ఎలాగైనా వియ్యపురాలు పద్ధతి మింగుడు పడటం లేదు.

ఛ... తను అభ్యుదయ రచయిత్రి అయి వుండి ఎందుకింత సంకుచితంగా ఆలో చిస్తోంది? అంత బాధలోనూ ఆత్మస్థైర్యంతో కర్తవ్యాన్నీ, బాధ్యతను నిర్వహిస్తున్న సాటి స్త్రీని అభినందించ వలసిందిపోయి ఆత్మవంచన చేసుకుంటోంది ఏమిటి? సామాన్యులకు తనకు తేడా ఏముంది?” శారదలో సందిగ్ధం...!!

— — —

“శారదా..., నీ కొడుకు ఎవరినో ప్రేమిస్తున్నట్లున్నాడు. నీకు కోడల్ని వెదికే శ్రమ తప్పించాడు”. “మీ కెలా తెలుసు...?” శారద నమ్మలేనట్లుగా అడిగింది.

“కారులో.... వాడి పక్కన ఎవరో అమ్మాయి...”

“లిఫ్టు ఇచ్చి వుండవచ్చుగా...” అంత మాత్రాన...?

“డాడీ చెప్పింది నిజమేనమ్మా...” అపుడే ఆఫీసు నుండి వచ్చి ఫ్రెష్ అయి వచ్చిన రఘు అన్నాడు...

“ఎవర్రా ఆ అమ్మాయి? మనకులం, గోత్రం...?”

“కుల మతాలకు అతీతమయినది, గోత్రాలకు, శాస్త్రాలకు అందనిది ప్రేమ ! అది ఎప్పుడు ఎవరిమీద ఏర్పడుతుందో ఆ దేవుడికే తెలియాలి. అని నీ ప్రేమే దైవం కథలో రాసావు కదమ్మా...”

“అయితే...??”

“నా ప్రేమ కూడా అలాంటిదే... ఆ అమ్మాయి చూడగానే నచ్చింది. పరిచయం చేసుకున్నాను. ఇద్దరం ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాం.”

“ఇంకా ఆ ప్రయత్నంలోనే వున్నారా? పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారా?” అందరిలాగే తన కథలు నవలలు చదివి తన కథలూ చదివి అభినందిస్తే పొంగిపోయింది కానీ, వాటిని అనుసరిస్తారని ఏ మాత్రం అని పించినా అలాంటి కథలు రాసేది కాదేమో....”

“ఒకరికొకరు నచ్చాక అభి ప్రాయాల దేముంది? ఆ అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తోంది. నీకు కావాల్సినట్లు సంప్రదాయ కుటుంబమయినా ఈ అమ్మాయి చాలా మోడ్రన్‌గా వుంటుంది. నాకు అటువంటి అమ్మాయే కావాలి. పూజలు, నోములూ, వ్రతాలు, ఉపవాసాలు అంటూ...”

“ఆపరా వాటిలో గొప్పదనం నీకేం తెలుసు?” కోపంగా అంది.

“నీకంత కోపం వచ్చిం దేమిటమ్మా..., అందరూ ఒకేలా ఆలోచించాలని లేదని రకరకాల మనుష్యులలాగే వాళ్ల మనస్తత్వాలు విభిన్నంగా వుంటాయని ఒకరికి తప్పనిపించింది మరొకరికి ఒప్పు అనిపించవచ్చని ఈ మధ్యనే నువ్వు రాసిన వ్యాసం మరచిపోయావా?” రఘు సూటిగా ప్రశ్నించాడు.

“రాసాను నిజమే... కానీ... ఎపుడూ మోడ్రన్‌గా వుండాలనీ, సంప్రదాయాలను, ఆచారాలను, కట్టుబాట్లను తెంచుకోవాలనీ చెప్పలేదు. పెద్దవాళ్లకు ఎదురు సమాధానం చెప్పాలని అసలు రాయలేదు. ఏదో సాహిత్యాభి మానంతో రచనలు చేసినంత మాత్రాన అవన్నీ నా పిల్లలే నా మీద ఆరోపిస్తారని అసలు ఊహించలేదని ఆవేశంగా అంది.

“నువ్వు ఊహించకపోవడం మా తప్పు కాదుగా... మా అమ్మ ఇంత అభ్యుదయ రచయిత్రి అని గర్వపడ్డాము అంతే గాని భర్త చనిపోయినంత మాత్రాన అన్ని అధికారాలు ఒదిలేసి మూల కూర్చోవాలనీ, వితంతువు ఎదురొస్తే వెనక్కు వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్ళాలని అనుకుంటున్నావనీ ఎలా ఊహిస్తాము? వరకట్నం మీద ఆడవాళ్ల అనేక సమస్యల మీద స్పందించి కథలు రాస్తే... మా అమ్మ ఇంత అభ్యుదయ రచయిత్రి అని గర్వించాము.... నువ్వే ఆచరించకపోతే మిగిలిన వాళ్ళు ఎలా ఆచరిస్తారు? పైగా ఈ అమ్మాయి వాళ్ళు పదిలక్షలు కట్నం ఇస్తారట. ఒకతే కూతురు కనుక తల్లిదండ్రుల తదనంతరం ఆస్తంతా తనదే...”

“అయితే నువ్వు ఆస్తి చూసి ప్రేమించావా?” రాజారావు కలగజేసుకున్నాడీ సారి.”

“నువ్వు కూడా ఏంటి డాడీ... నేను డబ్బుకు ఆశపడేవాడినా? ఆ అమ్మాయి నచ్చి ప్రేమించేను. తర్వాతే వివరాలు తెలిసాయి. ఆ అమ్మాయి మన కులం కాదు” తల్లి ముఖం లోకి సూటిగా చూడ లేనట్లు తలదించుకున్నాడు.

“సరే.. నీకు నచ్చితే చాలు...” కొడుకు తల నిమురుతున్న శారదను చూస్తూ “అడిగిన దానికన్నా

ఎక్కువ కట్నమే ఇస్తున్నారుగా..." అంటున్న భర్తను ఉరిమి చూసింది.

— — —

రఘు, రమ్యల పెళ్ళి చాలా ఘనంగా జరిగింది. స్వాతి భర్త, అత్తగారూ, తమకు కట్నం ఇవ్వనని మొండికేసిన శారద కొడుకు పెళ్లికి కట్నం తీసుకోవడం తెలిసి విస్తుపోవడమే కాక, స్వాతిని నానా మాటలూ అన్నారు.

స్వాతి బాధపడుతూ ఇవన్నీ తల్లితో చెప్పింది. "నువ్వేం బాధపడకమ్మా... మీ అత్త గారికి పట్టుచీర, అల్లుడికి సూటు. నీకు నెక్లెస్ పెడు తున్నాగా..," అంది తేలిగ్గా.. శారద.

"అయినా కట్నం ఇవ్వకుండా మీ అమ్మ నిన్ను చవగ్గా వదుల్చుకున్నారని సాధిస్తారే" అంటూ పేచీ పెట్టింది.

"ఇపుడేమంటావు? అయిపోయిన పెళ్లికి బాజాలు వాయించమంటావా? వాళ్లకేదో సర్ది చెప్పుకో..." పెళ్లి హడావుడిలో అత్తగారి హోదాలో శారద పట్టించుకోలేదు.

స్వాతి అత్తగారు పెళ్లికి రావడమూ, వచ్చి సాధించడమూ... శారదకు అస్సలు నచ్చలేదు... నచ్చినవే జరిగితే అది జీవితమే కాదు.

శారద పెట్టిన బట్టలు, నెక్లెస్‌కు కాస్త సంతోషించినా లక్షాధికారింటిపిల్ల శారదకు కోడలు కావడం, స్వాతి అత్తగారు తన అహంభావమో, ఆత్మాభిమానమో దెబ్బతిన్నందుకు కొంచెం బాధ పడ్డారు.

రమ్య కాలు కింద పెట్టకుండా గారాబంగా పెరిగింది. ఆమెకు వేళకు అన్నీ అమరుస్తూ శారద హైరానా పడుతోంది. "అంత కష్టపడకపోతే వంట మనిషిని పెట్టుకోవచ్చుగా ఆంటీ" అంటోంది రమ్య ముద్దుగా...

"వంటమనిషి చేస్తే మా అమ్మకు నచ్చ దంటాడు రఘు. అందరినీ చిద్విలాసంగా చూస్తుం టాడు రాజారావు........

ఒకసారి కోడలి మెడలో మంగళ సూత్రం కనబడక ఏమయిందని అడిగితే "పడుకునేటప్పుడు గుచ్చుకుంటోందని తీసి పెట్టా నాంటీ... మెడలో, చెవులవీ, చేతులవీ అన్నీతీసి పడుకోవడం నా అలవాటు... అంది రమ్య క్యాజువల్‌గా...

"బాబోయ్... ఈ విధంగా నేనే కథ లోనూ రాయలేదు. ఆ మాటకొస్తే నేను రచయిత్రినే కాదు" అంటూ కలవరిస్తోంది శారద.

# మోహంలో వున్నప్పుడు

మోహంలో వున్నప్పుడు
ఎవరయినా ఎంత అందంగా వుంటారు
వాన మబ్బులేవో వాలినట్టు
వెన్నెల తూనీగ తలచుట్టూ తిరుగుతున్నట్టు -
కళ్ళనిండా కాంక్షలుంటాయి
కనపడని మంటలుంటాయి
కనులు అరమోడ్పో, విప్పార్పో
ఆదిమ సమాజాల ఆనంద సంచలనాల
పిట్టకవో ఎగురుతున్నట్టు
శరీరమంతా మరీ, మహామృదువుగా, తేలిగ్గా
అదృశ్య పరిమళాలు రూపు దిద్దుకున్నట్టు -
అంతా ఒక అలౌకిక
ఫలపుష్పరాగోదయం
నేత్ర ద్వయాల నిండా అడవి పూలు
తటాకాలు సాగరాలై
సాగరాలు తనువులై ఒడ్డుల్ని కోస్తూ
విస్తుపోతుంటాయి.

మోహంలో వున్నప్పుడు
ప్రపంచమెంత అందంగా వుంటుంది
మనకు తెలియని మణులూ, మాణిక్యాలు
పరిమళించే సువర్ణాలు
శరీరంలోంచి పొంగుకొస్తాయి
ఎక్కడా కాఠిన్యం, క్రూరత్వం కనరావు
అంతా కమనీయమై
మహాద్భుత వర్ణ సమ్మేళనమై
ఆ బుజంమీద ఒక హరివిల్లు
ఈ బుజం మీద ఒక హరివిల్లు
ముట్టుకున్నదంతా మానవీయమై
మృదుమధురంగా తరళ తరళంగా -
కరుణ, కరుణ, ఆర్ద్రత ఆర్ద్రత
ఆశ ఆశ, ఆనందం, ఆనందం
లలిత లలిత స్వప్నాల సమ్మోహనా చలనాల స్నానాలు,
మోహంలో ఉన్నప్పుడు మనుషులు తేనెపట్టులు
భార రహితమై గాల్లో తేలుతూ
నిరవధిక ప్రేమతో పొంగి పొర్లుతుంటారు
అదేదో లోకంలో బతుకుతున్నట్టు
అపురూప అనురాగానికింత ఆదరువు దొరికినట్టు
వీళ్ళు మనుషులా - కాదు
మోహాలు పూసిన దివ్య పుష్పాలు
కొంచెం వాస్తవంగా
ఎక్కువ మార్మికంగా, కనపడీ కనపడనట్టు
తెరిచీ తెరవనట్టు, తెరలేవీ లేనట్టు, తేలిపోతున్నట్టు -
మోహాల మోహనరాగాల మనుషులు

మోహంలో వున్నప్పుడు
మనుషులెంత అందంగా వుంటారు
ఎప్పుడూ ఇట్టా వుంటే ఎంత బాగుందు.

- శివారెడ్డి